క్లుప్తంగా

ఇంటి పన్ను చెల్లించాలని మైక్ ప్రచారం



దాచేపల్లి : దాచేపల్లి నగర పంచాయతీ అధికారులు ఇంటి పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మైక్ ప్రచారం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలో 11,524 నివాస గృహాలు ఉండగా రూ.2.52 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.1.50 కోట్లు వసూలు చేశారు. మార్చి నెలాఖరునాటికి 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎంవీ అప్పారావు శుక్రవారం తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



గురజాల రూరల్ : రైతులు విధిగా రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ (రైతు నమోదు) తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి సూచించారు. స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పథకాలు అందాలంటే రైతులు నమోదు చేయించుకోవాలని, ఆధార్ కార్డు నకలు, పట్టాదారు పాసుపుస్తకం, 1–బి, ఆధార్‌కు లింకైన సెల్ ఫోన్ నబరును తీసుకుని రైతు సేవా కేంద్రానికి రావాలని సూచించారు.

వేణుగోపాల ఆలయ వార్షికోత్సవం



రెంటచింతల: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయ తృతీయ వార్షిక మహోత్సవాన్ని శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి శాంతి కల్యాణాన్ని తిలకించి భక్తులు పులకించారు. ఆలయ చైర్మన్ పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి (రాంబాబు), ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల నేతృత్వంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మాచర్ల: మహాశివరాత్రిని పురస్కరించుకుని మాచర్ల డిపో నుంచి శైవ క్షేత్రాలకు 58 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి శుక్రవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలంకు 20 బస్సు సర్వీసులు, సత్రశాలకు 36, మన్నేపల్లికి రెండు, దైదకు మూడు, పేరాలకు ఒకటి బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం నిర్ణయించిన టిక్కెట్టు ధర ప్రకారం సర్వీసులు ఉంటాయన్నారు. అదనపు చార్జీలు ఉండవని తెలిపారు. బస్సు సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏసు బోధనలు అనుసరణీయం



రెంటచింతల: ఏసు రక్షకుడని, ఆయన బోధనలు అనుసరణీయమని పిడుగురాళ్ళ పాస్టర్ ఇమ్మానుయేలు, వినుకొండ పాస్టర్ జాన్ చెప్పారు. రెంటచింతల హోసన్నా మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన హోసన్నా సువార్త స్వస్థత సభలలో వారు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు సందేశం వినిపించారు.

ధనకంత్రీలు

- వరుసగా ఐపీలు పెడుతున్న వ్యాపారులు
- దాచేపల్లిలో బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- రూ.15 కోట్లకుపైగా అప్పులు చేసి పరారైన బంగారం వ్యాపారి
- గత ఏడాది ఐపీ పెట్టిన ఇద్దరు వ్యాపారస్తులు
- చీటిపాటలతో రూ.కోటి కొల్లగొట్టిన మహిళలు



దాచేపల్లి : నమ్మకంగా ఉంటూ మాయమాటలతో మభ్యపెట్టి అప్పులు తీసుకున్న వ్యాపారులు వరుసగా ఐపీలు పెట్టి పరారవుతుండడంతో దాచేపల్లి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏదో వడ్డీ వస్తుందని ఆశపడి డబ్బులు ఇచ్చిన బాధితులు లబోదిబోమంటూ తలలు బాదుకుంటున్నారు. ఇటీవల దాచేపల్లి పట్టణంలో నివాసం ఉండే ఓ బంగారం వ్యాపారి సుమారుగా రూ15 కోట్లకుపైగా అప్పులు చేసి కుటుంబ సభ్యులతో కలిసి పారిపోయాడు. వ్యాపారి తన ఇల్లు, దుకాణం బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.70 లక్షలు రుణం తీసుకున్నట్టుగా తెలిసింది. దాచేపల్లి, మాదినపాడు, నడికుడి గ్రామాల్లోని రైతులే ఎక్కువగా వ్యాపారికి అప్పులు ఇచ్చినట్లుగా స్థానికులు చెబుతున్నారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యాపారి కుటుంబ సభ్యులతో దిగిన ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి సమాచారం తెలిపిన వారికి రూ.2 లక్షలు బహుమతిగా ఇస్తామని ఆఫర్ చేశారు. అయితే వ్యాపారి ఐపీ నోటీసులు పంపేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం.

గతంలోనూ ఘటనలు

గత ఏడాది కూడా పట్టణంలోని ఇద్దరు వ్యాపారులు సుమారుగా రూ.4కోట్లకు పైగా ప్రజల నుంచి అప్పులు తీసుకుని ఐపీ పెట్టారు. వీరికి అప్పులు ఇచ్చిన వారంతా సన్న, చిన్నకారు రైతులే. దీంతో బాధితులు ప్రామీసరి నోట్లు తీసుకుని పోలీసులను ఆశ్రయించారు. అలాగే ఇద్దరు మహిళలు చీటిపాటల పేరుతో సుమారుగా రూ.కోటికి పంగనామాలు పెట్టారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భర్త చేసిన అప్పులకు భార్య బలవన్మరణం

భర్త చేసిన అప్పులకు భార్య బలి అయింది. ఈ ఘటన దాచేపల్లి వాసులను కలచివేసింది. దాచేపల్లికి చెందిన ఓ వ్యక్తి పేకాట వ్యసనానికి బానిసై భారీగా అప్పులు చేశాడు. అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగటంతో గుంటూరుకు మకాం మార్చాడు. అప్పులిచ్చిన వారు కొందరు ఇటీవల గుంటూరు వెళ్లి గొడవ చేశారు. అతని భార్యపైనా అసభ్యంగా మాట్లాడారు. దీంతో మనస్తాపం చెందిన అతని భార్య గొడవ జరుగుతుండగానే తాము నివాసం ఉంటున్న అపార్టుమెంట్‌పై అంతస్తు నుంచి కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది.

సేవాలాల్ జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించాలి



సీనియర్ అసిస్టెంట్ రంగారావుకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

మాచర్ల రూరల్: గిరిజన ప్రజల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర వేడుకగా పరిగణించి సెలవు దినాన్ని ప్రకటించాలని గిరిజన ప్రజా సమైఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నూన్సావత్ రంగా నాయక్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రంగారావుకు వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘ సంస్కర్త అని, కొండ కోనల్లో నివసించే గిరిజనులకు విద్యా, వైద్యంపై అవగాహన కల్పించి వారిని ఆధునిక సమాజం వైపు తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన జయంతిని ఫిబ్రవరి 15న దేశవ్యాప్తంగా గిరిజనులందరూ జరుపుకుంటారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు శ్రీను నాయక్, మూడావత్ బాలాజి నాయక్, సర్దార్ నాయక్, పూజారి శంకర్ నాయక్, మూడావత్ మత్రు నాయక్, పూజారి రామావత్ కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యకు నివాళి



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నగర పంచాయతీ సిబ్బంది



రెంటచింతల గిరిజన పాఠశాలలో..

గురజాల : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతిని శుక్రవారం నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వైవీఎస్ శివన్నారాయణరావు, ఏఈ ఖాసీం, అనూష, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్య జయంత్యుత్సవం

రెంటచింతల: స్థానిక ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో దామోదరం సంజీవయ్య జయంత్యుత్సవం శుక్రవారం నిర్వహించారు. తొలుత సంజీవయ్య చిత్ర పటానికి స్కూల్ ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య గురించి వివరించారు.

ముందే వెల్లువెత్తిన ఆనందం

పీఆర్కే జన్మదిన వేడుక నిర్వహించిన అభిమానులు



పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కేక్ తినిపిస్తున్న కార్యకర్తలు, అభిమానులు

మాచర్ల : వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదినం శనివారం జరగనున్న నేపథ్యంలో ముందే అభిమానులు, కార్యకర్తల్లో ఆనందం వెల్లువెత్తింది. శుక్రవారం మాచర్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి భారీగా చేరుకుని కేక్ కట్ చేసి పిన్నెల్లికి తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. పిన్నెల్లి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షులు కొమ్ము చంద్రశేఖర్ , ఎస్సీ సెల్ విభాగానికి చెందిన బూదాల మరియమ్మ, కౌన్సిలర్లు మాచర్ల సుందరరావు, మందా సంతోష్, ఎస్సీ విభాగ రాష్ట్ర, జిల్లా నాయకులు బొంగురు, రాయపాటి మాణిక్యం, కందుకూరి మధు, మోహన్, జయపాల్‌తోపాటు కారంపూడికి చెందిన పలువురు ఎస్సీ సంఘ నాయకులు, మైనార్టీ నాయకులు షేక్ నాగూర్, ఖిజర్, అబ్దుల్ జలీల్, బొంకూరి నాగేశ్వరరావు, బొగ్గవరపు నాగరాజు, దాసు, అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో ఆర్‌యూబీని ఏర్పాటు చేయాలి



రైల్వే అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామ రైతులు

నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డ సమీపంలోని రైల్వే లైన్ వద్ద రెండవ ఆర్‌యూబీని ఏర్పాటుచేయాలని రైతులు రైల్వే అధికారులను కోరారు. మలుపుతో, తక్కువ ఎత్తుతో ఏర్పాటుచేసిన మొదటి ఆర్‌యూబీ వలన రైతులు పడుతున్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్ గ్రామస్తులు గ్రీవెన్స్‌లో తెలియజేశారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు శుక్రవారం గ్రామంలో పర్యటించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌యూబీలో మలుపు వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, తక్కువ ఎత్తుతో ఉండటం వలన ట్రాక్టర్లతో పోలాల నుంచి వరి గడ్డిని తీసుకురావడం కష్టంగా మారుతుందని తెలిపారు. రెండవ ఆర్‌యూబీని తొమ్మిది అడుగుల ఎత్తు, తొమ్మిది అడుగుల వెడల్పుతో ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి

మాచర్ల : పొలం ఉన్న ప్రతి కర్షకుడూ రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మాచర్ల మండల వ్యవసాయ అధికారి లక్ష్మారెడ్డి సూచించారు. శుక్రవారం లక్ష్మారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలు పొందాలంటే తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకం, మొబైల్ ఫోన్‌తో జిరాక్సు కాపీలు తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు



మాచర్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో ప్రతి కూలికి పని కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సిద్ధలింగమూర్తి శుక్రవారం తెలిపారు. మండలంలోని జాతీయ ఉపాధి హామీ కార్యాలయంలో మాచర్ల, గురజాల క్లస్టర్ పరిధిలోని ఏపీఓ, పీఏలకు సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా అధికారి సిద్దలింగమూర్తి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి గురజాల క్లస్టర్ అధికారి ఏపీడీఐ పి.మల్లికార్జున్ అధ్యక్షత వహించారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

గురజాల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్దాలింగమూర్తి అన్నారు. స్థానిక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై నియోజకవర్గ స్థాయి అధికారులు, సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు.

చిన్ననాటి నుంచే నైపుణ్యాలు పెంచాలి



గురజాల : చిన్ననాటి నుంచే చిన్నారుల్లో చదవడం, రాయడం, వినడం, మాట్లాడటం వంటి నైపుణ్యాలను వెలికి తీయాలని ఇన్‌చార్జి సీడీపీవో వై.రత్నకుమారి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు బోధించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

ఆ వీడియోలతో సంబంధం లేదు

పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు



సీఐ శ్రీరాం వెంకట్రావు

పిడుగురాళ్ల: ఇటీవల సోషల్ మీడియాలో వచ్చే వీడియోలకు పోలీసులకు ఎటువంటి సంబంధం లేదని, కావాలనే కొంత మంది పోలీసులకు ఆపాదిస్తున్నారని పిడుగురాళ్ల పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ ఎన్నికలకు పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 23వ వార్డు కౌన్సిలర్ భర్త జూలకంటి శ్రీనివాసరావు నాగులు గుడి దేవస్థానంలో అధ్యక్షుడిగా చేసిన సమయంలో వెండి లెక్క చెప్పలేదని పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిలిపించి మాట్లాడామని, పెద్దల సమక్షంలో అది పరిష్కరించామని వివరించారు. పులి బాలకాశీని తీసుకొని వచ్చామని, అతని భార్య వీడియో రిలీజ్ చేసిందని, అయితే బాలకాశీ తాను వ్యాపారం నిమిత్తం వెళ్లి ఉన్నానని తరవాత వస్తానని వీడియో రిలీజ్ చేశాడని వెల్లడించారు. అదే విధంగా కౌన్సిలర్ షేక్ మున్నీరా భర్త సైదావలి పోలీసులు ఇబ్బంది పెట్టారని వీడియోలు రిలీజ్ చేస్తున్నాడని, తాము ఎవరిని ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని చెప్పారు. సోషల్ మీడియాలో పోలీసులపై వచ్చే ఆరోపణలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి దుష్ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుంటామని స్పష్టం చేశారు.

దైదలో భక్తులకు అసౌకర్యం కలగకూడదు



స్వామిని దర్శించుకుంటున్న శ్రీనివాసరావు

గురజాల రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలుగకుండా చర్యలు చేపట్టాలని గుంటూరు జోన్ దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు చెప్పారు. దైద గ్రామంలోని అమర లింగేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన బిలంలో కొలువై ఉన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో శానిటేషన్, క్యూలైన్లు, మహిళలు దుస్తులు మార్చుకొనే గదులు ఏర్పాటుచేయాలని సూచించారు.

మృతిచెందిన గోవుతో ఆందోళన



దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు మృతి చెందిన గోవుతో ఆందోళన చేస్తున్న పిచ్చయ్య

దాచేపల్లి : నిలువ నీడలేక.. తాగటానికి నీళ్లు లేక గోవులు చనిపోతున్నాయని దాచేపల్లికి చెందిన పసుపులేటి పిచ్చయ్య అనే వ్యక్తి శుక్రవారం ఆందోళన చేపట్టారు. దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు గోశాలలో మృతిచెందిన గోవును తీసుకువచ్చి పిచ్చయ్య ఆందోళన చేసి ఆవేదన వ్యక్తం చేశారు. దాచేపల్లిలో గోశాల నిర్మాణం కోసం 2021లో ప్రభుత్వం 3 ఎకరాల భూమి కేటాయించి పట్టా కూడా మంజూరు చేసిందని, ఈ గోశాలలో 100కిపైగా గోవులు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఈ గోశాలకు ఇచ్చిన పట్టా సరైనది కాదని ప్రస్తుతం రెవెన్యూ అధికారులు చెబుతున్నారని పిచ్చయ్య వివరించారు. గోశాలలో వసతులు కల్పించకపోవడంతో గోవులు మృతిచెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోశాల కోసం కేటాయించిన స్థలం క్రమబద్ధీకరించి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పిచ్చయ్యతో రెవెన్యూ అధికారులు, పోలీసులు మాట్లాడారు. ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో పిచ్చయ్య ఆందోళన విరమించారు.

నిత్య సహాయ మాతా.. వందనం



తేరు ప్రదర్శనలో కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు



దివ్య సమిష్టి ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మాచర్ల: నిత్యసహాయ మాత వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఎన్ఆర్ఐలు డీకన్ గ్రెగోరీ ట్రమ్, మిస్సోరీలతోపాటు ముఖ్య అతిథులు కొమ్మారెడ్డి ఇన్నారెడ్డి, యేరువ బాల శౌరిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలో ఫాదర్ కొమ్మారెడ్డి రఫేల్ రెడ్డి ఆధ్వర్యంలో దివ్య సమిష్టి బలి ప్రార్థన కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఫాదర్లు క్రీస్తు సందేశం ఇచ్చారు. భారీగా క్రైస్తవులు తరలివచ్చారు. సాయంత్రం క్రైస్తవ విద్యార్థులు కోలాట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తేరు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ రఫేల్‌రెడ్డితో పాటు, పెద్దలు ఎన్.సుందరరావు, జి.కిరీటిరెడ్డి, జక్కిరెడ్డి మర్రెడ్డి, ఎస్.కస్తూరి బాయి, సంగం లూర్డు ప్రేమ్ కుమార్, గాంధీ, సిస్టర్లు తామాసమ్మ, సుజాత, ఇన్నమ్మ, ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ఆరంభం

- తొలిరోజు వైభవంగా స్వామివార్ల కల్యాణం, గ్రామోత్సవం
- నేడు భారీ అన్నదాన కార్యక్రమం



లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న వీరాంజనేయస్వామి ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు పరిమి లక్ష్మీనారాయణశాస్త్రి, దర్శి అనిల్‌కుమార్‌శర్మ స్వామివారిని అలంకరించి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం సువర్చలా సమేత వీరాంజనేయస్వామి కల్యాణం నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమం, సుప్రభాత సేవ, విష్ణ్వేశ్వర పూజ, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, తమలపాకులతో అర్చన, నూతన వస్త్రాధారణ గావించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం గోత్రనామ పూజల అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.

నో బ్లాక్ డే కార్యక్రమం

నూజెండ్ల: ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి మూడవ శనివారం నో బ్యాక్ డే కార్యక్రమం నిర్వహించుతున్నట్లు ఎంఈవో రవిచంద్ర తెలిపారు. నో బ్యాక్ డే సందర్భంగా విద్యార్థులు స్కూల్ బ్యాగ్ లేకుండా పాఠశాలకు రావాలని ప్రోత్సహించే రోజు అన్నారు. తరగతులకు బదులుగా విద్యార్థులకు బోధనేతర అంశాలు ఆచరణాత్మక అభ్యాసనలు ఉపాధ్యాయులు నిర్వహిస్తారు. దీనివల్ల విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించడానికి ఉపయోగపడుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో పెద్దారవీడు వాసి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు కథనం ప్రకారం.. గుంటూరు నుంచి ప్రకాశం జిల్లా పెద్దారవీడుకు ఎలక్ట్రానిక్ సామాను లోడుతో వస్తున్న వాహనాన్ని ఎదురుగా దోర్నాల నుంచి పిడుగురాళ్ళకు వస్తున్న మరో వాహనం ఢీకొంది. ఈఘటనలో పెద్దారవీడు గ్రామానికి చెందిన అమనగంటి వెంకట రమణ సంఘటన స్థలంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు సంఘటన స్థలానికి హుటాహుటీన చేరుకొని తీవ్ర గాయాలతో బాధపడుతున్న సనకాల గోపి, సనకాల ఆంజనేయులు, కొటపాటి గోపి క్షతగాత్రులను 108 అత్యవసర వాహనంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలా చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి శవపంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

నాదెండ్ల: చందవరం గ్రామానికి చెందిన మైనర్ బాలిక గుండబొమ్మ రేణుశ్రీ (17) ఇంట్లో వంట చేస్తుండగా అగ్నిప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై జి. పుల్లారావు వివరణ ఇచ్చారు. రేణుశ్రీ సాతులూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుకుంటోంది. ఈ నెల 5న సాయంత్రం సమయంలో ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు దుస్తులకు మంటలు అంటుకున్నాయి. దీంతో గాయాలపాలైన బాలికను కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ నెల 12న మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. 13న చికిత్స పొందుతూ మృతిచెందింది. తండ్రి రాజారమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

